# హీరో - పెన్ను

- కె. వి. గిరిధరరావు



'శారదా నను చేరగా. . . ఏవిటమ్మా సిగ్గా. .' అని మొన్న చూసిన కొత్త సిన్మాలో పాట పాడుకుంటూ, పెన్సిల్ ముక్కు చెక్కుకుంటూంటే, ముక్కు మళ్ళీ విరిగింది. ఈ పెన్సిల్ ముక్కొకటి, పూరికూరికే విరిగిపోతోంది. చెక్కి చెక్కి చేతులు, వేళ్ళు నొప్పెడుతున్నాయి. పెన్ను కొనిపెట్టమంటే నాన్నేమో ఉలకడు పలకడు. 'నువ్వు రాసే రాసుడికి ఆ పెనిసిలే ఎక్కువొంటుంది అమ్మ.

అయినా పెన్నుకంటే పెన్సిలే నయం కొన్ని సార్లు. హోంవర్కులో లెక్కలు తప్పు చేస్తే - బడికెళ్ళాక, బాచిగాడి బుక్కు చూసి మన లెక్కలో ఆన్సర్ దిద్దుకోవొచ్చు. పెన్నుతో ఒకసారి రాసింది దిద్దితే మొన్న బాచిగాడిలా మేష్టరికి దొరికి పోవడమే!

'మా అమ్మ నిన్ను పిలుచుకు రమ్మందం'టూ బాచి గాడి చెల్లెలొచ్చి చెప్పింది. వాల్లది మా పక్కల్లే.

వాళ్ళింట్లో ఏమైనా తినేయి చేసినప్పుడు నన్ను పిలిచి పెడుతుంది వాళ్ళమ్మ. అందుకే పరిగెత్తుకుంటూ వెళ్ళా.

బాచిగాడు మంచం మీద కూర్చుని గుమ్మం వైపు చూస్తున్నాడు. వాడికింకా జ్వరం తగ్గినట్లు లేదు. అయినా వీడికి జ్వరమైతే వీళ్ళమ్మ తినేయెందుకు చేస్తుంది?!

'ఏరా, నీకింకా జ్వరం తగ్గలా?' అడిగాను బాచిని.

అడ్డంగా తలూపాడు. అన్నం కూడా తిన్నట్టు లేడు. బాగా చిక్కిపోయాడు.

'మరైతే రేపు కూడా బడికి రావా?'

మళ్ళీ తల అడ్డంగా ఊపాడు. అబ్బ జ్వరమొస్తే ఎంత హాయి. ఎంచక్కా బడి ఎగ్గొట్టొచ్చు.

'బాచి ని తీసుకుని ఆస్పత్రికి వెళ్లొస్తావా?'అడిగింది బాచి వాళ్ళమ్మ - సున్నుండ చేతిలో పెట్టి.

సున్నుండలంటే - అదీ నేతితో చేసినవి - నాకిష్టం. మా అమ్మ ఎప్పుడోగానీ అలాంటివి చేయదు. నెయ్యి రేటెక్కువని.

సున్నుండ కొరుక్కుంటూ, వెళ్లొస్తానని తలూపా.

**********************************************

ఆస్పత్రి పెద్ద దూరమేం కాదు, నాలుగిళ్ళవతలే.

దారిలో ఆ రోజు బళ్ళో హెడ్ మాష్టరు గారమ్మాయి గొలుసుపోయిన విషయము, మేష్టర్లంతా పిల్లలకు పిచ్చి బియ్యం పెట్టి దొంగను పట్టుకున్న సంగతి బాచికి చెబుతుండగానే

ఆస్పత్రి వచ్చేసింది.

కంపౌండర్ మమ్మల్ని ఆ పక్కన బల్ల మీద కూర్చోబెట్టి, థర్మామీటర్‌తో బాచి జ్వరం చూసి, డాక్టరు దగ్గరకు తీసుకుపోయాడు.

తెల్ల చొక్కా, చొక్కా మీద గుండె ఆడుతుందో లేదో చూసే మిషను, కాళ్ళకు నల్లగా మెరిసే బూట్లు... కళ్ళకు అద్దాలు పెట్టుకుని డాక్టరు గారు నిజంగా సినిమాలో డాకటేరు వేషమేసిన శోభనబాబులా వున్నారు. మమ్మల్ని చూసి నవ్వి, బాచితో 'నీకు జ్వరం తగ్గింది. సాయంత్రం చారుతో అన్నం తిను. రేపొద్దుట్నించీ మామూలుగా బడికెళ్ళు'అన్చెప్పాడు.

బాచి గాడు నేల చూపులు చూస్తున్నాడు. మరి ఎవడికైనా బడి కెళ్ళాలంటే బెంగే కదూ!

'మీరే క్లాసు చదువుతున్నారు?' అడిగాడు డాక్టరు.

చెప్పాన్నేను.

'మిమ్మల్నొకటడుగుతా...నిజం చెబతారా?'మళ్ళీ అడిగారు డాక్టర్.

'ఓ...చెబతాం' అన్నాన్నేను. బాచి గాడు మెల్లగా తలూపాడు, చెబతానన్నట్లు.

'నా పెన్నొకటి మొన్నటినుంచీ కనబడ్డం లేదు. మీరేమైనా తీసుకెళ్ళారా?'అడిగాడు మా ఇద్దరి వైపు చూస్తూ.

'మేము తీసుకెళ్ళలెదు'అన్నాడు బాచి.

ఆసుపత్రికి నిన్న మొన్న నేను రాలేదని చెప్పాను.

మా ఇద్దరిని దొంగల్ని చూసినట్లు చూసి, 'సరె అయితే. ఒకేల తీస్తె మాత్రం నాకిచ్చేయండి. ఇచ్చిన వాళ్ళకు మంచి బహుమతిస్తా' అన్నాడు.

'సరే' అన్చెప్పి డాక్టర్ గదిలోంచి బయటకొచ్చాం.

కాంపౌండర్ మమ్మల్ని చూసి, 'మీరు గాని పెన్నెత్తుకెళ్ళుంటే డాక్టరుకిచ్చేయండి. లేకపోతే పిచ్చి బియ్యం పెట్టి దొంగెవరో కనుక్కుంటాడు. అప్పుడు పోలీసులు మిమ్మల్ని తీసుకెళ్ళి కొట్లో పడేస్తారు'అన్చెప్పాడు.

'మేము తీసుకెళ్ళలేదని చెప్పాం కదా'అని, గబగబ బయటకొచ్చేశాం.

***********************************************

కాస్త దూరమొచ్చాక 'అరేయ్...పిచ్చి బియ్యం పెడితే, నిజంగానే దొంగ దొరుకుతాడా?' అడిగాడు బాచి.

'టపీ మని దొరుకుతాడు. పొద్దున స్కూల్లో దొరకలా. పిచ్చి బియ్యానికి దొరక్కపోతే మంత్రం పుల్లలిచ్చి కనుక్కుంటారు. అప్పటికీ దొంగ దొరక్కపోతే అంజనమేసి చూస్తారేమో...అంజనమంటే తెలుసుగా...మంత్రం చదివి...చేతిలో కాటుక రాసి...మళ్ళీ మత్రం చదివితే – దొంగ పోటో ఆ కాటుకలో కనిపిస్తుందంట!

అల్లప్పుడు మా పిన్నమ్మ వాళ్ళ బర్రె పోతే అంజనమేసేకదా పట్టుకున్నారు'

'అలాగా'అన్నాడు బాచి.

వాడిని వాళ్ళింటి దగ్గర వొదిలిపెట్టి నేను మా ఇంటికొచ్చేశాను.

*************************************************

మర్నాడు పొద్దున నేను బడికి వెళ్ళేటప్పుడు – బాచి వాళ్ళింటికి వెళ్ళా. అప్పటికే వాడు బడికి రావడానికి రెడీ అయి వున్నాడు. నిన్నటి కంటే కాస్త హుషారుగా కనిపించాడు. దారిలో – పిచ్చి బియ్యం గురించి మొదలెట్టాడు. నిన్న రాత్రి 'పిచ్చి బియ్యం పెట్టి దొంగని పట్టు కోవొచ్చా' అని వాళ్ళ నాన్న నడిగాడట. ఆయన...అదంతా ఉత్తుత్తికే. మంత్రాలు లేవు గింత్రాలు లేవు...అంతా బోగస్ అన్నాట్ట.

'అరేయ్ నిన్న స్కూళ్ళో జరిగింది చెప్పానా?! ఇంకా...అల్లప్పుడెప్పుడో పొట్టి రామాంజనీలు తెలుగు వాచకం పుస్తకంపోతే మంత్రం పుల్లలిచ్చే కదా దొంగను పట్టుకుని ఉతికింది?'గుర్తు చేశాను.

'అవును కదూ...మరి డాక్టరు కూడా పిచ్చి బియ్యం పెడతాడంటావా?'అడిగాడు బాచి.

'ఏమో ఎవడికి తెలుసు. అయినా మనమేం దొంగలం కాదుకదా మనకేం భయం?!'అన్నాన్నేను. అలా అన్న తర్వాత అనుమానమేసి 'అరే డాక్టరు పెన్ను నువ్వేత్తుకొచ్చావు కదూ'అడిగాన్నేను.

'పిచ్చోడా...నేనెందుకెత్తుకొస్తాను. నాక్కూడా పెన్నుందిగా'అన్నాడు.

అదీ నిజమే. మనకి పెన్ను లేక పోతేనే కదా పెన్ను దొంగతనం చేసేది. మన దగ్గర పెన్నుంటే మళ్ళీ పెన్నే ఎందుకు దొంగతనం చేస్తాం?!

మరి వీడు పిచ్చి బియ్యం గురించి, డాక్టరు గురించి ఎందుకడుగుతున్నాడు?!

'ఈ పుస్తకమ్మీద ఒట్టేసి చెప్పరా...నువ్వు పెన్ను కొట్టెయ్యలేదూ' అడిగాను, నా చంకలో పుస్తకం తీసి వాడి ముందుకు చాపి.

'ఒట్టు లేదు పాడు లేదు. నేను పెన్ను తియ్యలేదు'అన్నాడు వాడు.

'అబద్ధమాడితే కళ్ళు పోతాయట. సత్యం మాష్టారు చెప్పలేదు?!'అన్నాన్నేను.

నడుస్తున్న వాడల్లా ఆగి పోయి 'నువ్వెవరికీ చెప్పనంటే చెబతా...చెప్పనని ఒట్టెయ్యి'అన్నాడు చెయ్యి చాపి.

చెప్పనని ఒట్టేసాక, డాక్టరు పెన్ను బాగుందని అందుకే తీసుకున్నానని చెప్పాడు. చెప్పి సంచిలోంచి పెన్ను బయటకు తీసి చూపెట్టాడు.

బంగారం కాపుతో నల్ల పెన్ను దర్జాగా ఉంది.

నేనొకసారి నాపేరు రాసిస్తానని అడిగా. ఇచ్చాడు వణకుతున్న చేతులతో.

కాపు తీస్తే, తల దాకా నల్ల దుప్పటి కప్పుకున్న దొంగ మొహంలా పాళీ కొస తొంగి తొంగి చూస్తోంది. నా పేరు పుస్తకం మీద రాసుకున్నాను... పెన్ను మెత్తగా రాస్తోంది. పచ్చ ఇంకులో నా పేరు మెరిసింది.

'అయిదు రూపాయలుంటుందా పెన్ను'అడిగాను.

'అయిదేందిరోయ్. ఆ బంగారం కాపే పది రూపాయలుంటుంది. చూడు... పాళీ కూడా బంగారమే. దీన్లో ఇంకెట్లా పొయ్యాలో తెల్సా...'అంటూ, పెన్ను కింది డొప్పను తీసి ఇంకు పీల్చే పిల్లరును చూపెట్టాడు.

ఇంకు పోసుకునేటప్పుడు చేతులకి ఇంకు అంటదు. భలేగుంది పెన్ను. అట్లాంటి పెన్ను నాకుంటే ఎంత బావుణ్ణు అనుకున్నాను.

నా జేబిలో పెన్సిలు వొంటికి గుచ్చుకుంటా ఉంది.

'ఎవరికీ చెప్పకపోతే, నీక్కూడా రాసుకోడానికి ఇస్తా' అన్నాడు బాచి.

'నేనెవరికి చెప్పకపోయినా పిచ్చి బియ్యం పెడితే దొరుకుతావుగా'అన్నాన్నేను.

'దొరికినప్పుడు చూసుకుందాం. నువ్వెవరికీ చెప్పొద్దు'అన్నాడు బాచి.

నేను కాసేపు గమ్మునుండి పోయాను.

'ఎవరికీ చెప్పకుండా ఉంటే నీకు రోజూ నా హోంవర్కు లెక్కలు చూపిస్తా... అప్పుడప్పుడూ అయిసులు కొనిపిస్తా'ఆశ పెట్టాడు బాచి.

నా చేతిలో పెన్ను ఎండలో మెరుస్తోంది. ఎంత బావుందో!

నేను ముక్కు ఇరిగిన పెనిసిలుతో రాసుకుంటూంటే... నా పక్కనే కూర్చునే బాచిగాడు... బంగారపు కాపున్న పెన్నుతో రాయడమా?! ఎందుకిలా... వాడి కొచ్చిన జ్వరం నాకొచ్చి, డాక్టరు దగ్గర పెన్ను నేనే ఎత్తుకొచ్చుకుంటే ఎంత బావుండేదనిపించింది! అప్పుడప్పుడూ రాసుకోడానికిచ్చినా అది నా సొంత పెన్ను కాదు కదా. ఇట్లాంటి పెన్ను నా జనమలో కొనగలనా? ఇప్పుడీ పెన్నుని బాచీ గాడి దగ్గర నుంచీ లాగేసుకుంటే... నేనే పరుగెట్టుకెళ్ళి డాక్టరుకీ పెన్నిచ్చేసి, బహుమతి తెచ్చేసుకుంటే... ఎలాగైనా ఈ పెన్ను బాచిగాడి దగ్గరుండొద్దు...

సత్యం మాష్టారు సైకిలు మీద వెళ్తూ బెల్లు మోగించి 'ఒరేయ్ గాడిదల్లా అలా రోడ్డు మీద నిల్చున్నారేంటిరా... టైమవుతోంది తొందరగా బడికేడవండి'అంటూ వెళ్ళిపోయారు.

బళ్ళో మాష్టర్లు చెప్పిన నీతి కతలు గుర్తొచ్చాయి. పరుల సొమ్ము పాములాంటిదనే అమ్మ మాటలు, నాయన చెప్పిన అబద్ధమాడని హరిచ్చెంద్రుడి కత, నేతి సున్నుండలు ప్రేమతో నాకు పెట్టే అమ్మ లాంటి బాచి వాళ్ళమ్మ... స్కూళ్ళో ఎప్పుడూ నా పక్కనే కూర్చునే బాచి...!

పెన్నుతో మరొక సారి పుస్తకమ్మీద నా పేరు రాసుకున్నాను. చక్కగా రాస్తోంది.

పెన్ను బాచికి ఇచ్చేసి 'నువ్వా పెన్ను డాక్టరుకివ్వక పోతే, నేన్నీతో ఇంకెప్పుడూ మాట్లాడను'అన్నాను.
అర్థం కానట్లు చూశాడు బాచి.
'ఈ పెన్ను మనకొద్దురా. యాక్కు... ఆ పెన్ను కంటే నీ దగ్గరున్న బులుగింకు పెన్నే బాగా రాస్తుంది. దాన్ని డాక్టరుకిచ్చెయ్యి. దొంగతనం తప్పు కదా. నువ్వే పెన్ను కాజేశావని తెలిస్తే అందరూ నిన్ను దొంగని కొడతారు...పోలీసులకు పట్టిస్తారు...అప్పుడు అప్పుడు...నీకు నాకు పచ్చి...మీ అమ్మ నాన్న కూదా నీతో మాట్టాడరు...'
కళ్ళార్పకుండా కాసేపు నావైపే చూశాడు. తర్వాత పెన్నును చూసుకున్నాడు.
*********************************************
ముప్పైయ్యేళ్ళ తర్వాత...

మద్రాసు విమానాశ్రయంలో అనుకోకుండా బాచిని కలవడం తటస్థించింది. వాడిప్పుడు ఐ.పి.ఎస్ ఆఫీసరు.
కాస్సేపు ఆ కబుర్లు ఈ కబుర్లు అయ్యేక, వాళ్ళావిడకూ, అయిదేళ్ళ కొడుకుకు మా చిన్నప్పటి 'పెన్ను' ఉదంతం చెప్పి, నన్నందులో హీరోని చేశాడు. అప్పుడు వాడి ప్రవర్తనను నేను సరి చేయడం వల్లనే, మళ్ళీ తనెప్పుడూ అలాంటి తప్పు చేయలేదనీ...ఇప్పుడీ స్థితిలో ఉండడానికి పరోక్షంగా నేనే కారణమనీ చెప్పాడు. వాడి గొంతులో ధ్వనించిన ఉద్వేగం నన్ను కదిల్చింది.
కారణం ఫలానా అని తెలియదు గానీ, ఇంత కాలం నన్ను కూడా ఆ పెన్ను సంఘటన వదల్లేదు.
"నేను నీకో నిజం చెప్పాలి" అని, ఆశ్చర్యంగా చూస్తున్న బాచి దగ్గరకు వెళ్ళి, వాడి చేతుల్ని నా చేతుల్లోకి తీసుని"ఆ సంఘటనలో...నిన్ను మార్చుకోవాలన్న తపన కంటే...నాకు లేని పెన్ను నీకుండ కూడదన్న అసూయే ఎక్కువుందేమోనని నా అనుమానం. అందుకే నిన్నంతగా బెదరగొట్టి...నువ్వు ఆ పెన్ను డాక్టర్కిచ్చేలా చేశాను. నేనే ఉద్దేశ్యంతో అలా ప్రవర్తించినా నీకు మంచే జరిగింది. నాకు చాలా ఆనందంగా ఉంది"అన్నాను, బాచి కళ్ళలోకి చూస్తూ.